# ఆచార్య దేవోభవ!

"ఈరోజు ఉప్పర్‌పల్లి వెళ్తానన్నారు. మరచిపోయారా?" అంటూనే దుప్పటి ముసుగు లాగింది చందన - భార్యామణి.

బలవంతంగా కళ్లు తెరిచాను. ఒక్కసారి నులుముకొని మళ్లీ చూశాను.

అప్పుడే విచ్చిన లేతగులాబీల్లాంటి బుగ్గలు, విశాలంగా తెరచుకొని నన్నే చూస్తున్న పద్మాల్లాంటి కళ్లు. పల్లవిస్తున్న మందార రేకుల్లాంటి పెదాలు, ఆ పెదాలకూ నుదుటికీ మధ్య నిట్టనిలువుగా గీచిన బాపూరేఖ లాంటి ముక్కు, పొద్దుపొడుపువేళ ఇన బింబాన్ని తలపించే బొట్టు..... ఇప్పుడిప్పుడే తలంటుచేసినట్టుంది - తలకట్టు... అందమైన ఆ మోము నుండి విడివడటం ఇష్టం లేక జారబోతూ ఆగిపోయిన నీటిబొట్లు అకర్షక పత్రాలపై తుషార బిందువులను తలపిస్తున్నాయి.

అమాంతం వాటేసుకొని ముద్దుల్తో ఆ మోముని ముంచెత్తాలన్న భావోద్వేగాన్ని అదుపులో పెట్టుకోవడం చాలా కష్టమైంది. అయినా పాచి మొహంతో అలాంటి పిచ్చిపనులు చేయడం చందనకు అస్సలిష్టముండదు.

"అబ్బా! ఇంకాస్సేపు పడుకోనీవోయ్?" గబుక్కున దుప్పటి మళ్లీ మొహం పైకి లాక్కొని పక్కకు తిరిగి పడుకున్నా. 'అయినా ఇదెక్కడి పెళ్లాంరా బాబూ! ఎవరైనా మొగుడెప్పుడూ తన కళ్లముందుండాలనుకుంటారుగానీ ఆ పనీ ఈ పనీ గుర్తుకు చేసి, బయటకి తరిమేయాలనుకుంటారా?' గొణుక్కున్నా.

చందన విన్నట్టుంది. ఓ నిట్టూర్పు విడిచింది. "హు! త్యాగరాయ గానసభలో పదకొండింటికి శేషాచలపతిగారి సాహిత్య కార్యక్రమం ఉందన్నారు. సాయంత్రం ఘంటసాల

విభావరికి కలిసి వెళ్దామన్నారు. రాత్రికి..." నిన్న రాత్రి ఈ రోజు కోసం ప్లాన్ చేసుకున్న షెడ్యూలు రికార్డెడ్ వాయిస్‌లో వినిపించసాగింది.

నా నిద్ర పటాపంచలైంది. విసుగు ఆవిరైంది. స్ప్రింగ్‌లా లేచాను మంచమ్మీద



నుంచి - "ఇప్పుడు టైమెంత?" నిర్ధారణ కోసం అడిగా.

"ఏడున్నర!" నవ్వు బిగబట్టుకుంటూ చెప్పింది ఆవిడ.

యానిమేషన్ బొమ్మలా పనులు నిర్వర్తించుకోవడం మొదలెట్టాను.

జీవితంలో ఏం వద్దనుకుంటామో అవే మనకు అంటుకుంటాయి తుమ్మజిగురులా. ఎట్టి పరిస్థితుల్లోనూ హైదరాబాద్‌లో ఉద్యోగం చేయరాదనుకున్నాను. అది అనుకున్న ఆర్నెలలు తిరగకుండానే వచ్చిపడ్డాను. నా తోటి ఉపాధ్యాయ మిత్రులంతా ఇక్కడ పని చేయడం మహా అదృష్టమన్నారు. అభినందించారు. పనిలో పనిగా అసూయపడ్డారు కూడా. అందుకు కారణం జీతంలో వృద్ధి, జిల్లాలో ట్రాన్స్‌ఫరైనా ఇరవై కిలోమీటర్ల కైవారం మించదు. అదీ నిజమే. కానీ జీవితమే అర్థరహితంగా మారిపోయింది నేనూహించినట్లే.

లేచింది లగాయతు నిద్రించే దాకా పరుగే పరుగు. ఎందుకు? ఎలా? అని ప్రశ్నించుకో

గూడదు. అట్లా ప్రశ్నించుకోవడం 'నాగరీకు'ల లక్షణం కాదు. అలా పడుతూ లేస్తూ పరుగుపెడుతూనే ఉండాలి. కాలం పన్నెండు అశ్వాలు కూర్చిన ఏకచక్ర రథం మీద రెండు కొరడాలు పుచ్చుకొని వెంట పడుతూ ఉంటుంది. ఆ ఇనుప చక్రం మన మీద నుంచి నిర్దాక్షిణ్యంగా దూసుకుపోతుంది. ఆ తర్వాత జీవితం నిశ్శేషమైనా నిస్తేజమైన బాధ్యత మనదే. ఈ దుస్థితి నుంచి తప్పించుకునేందుకు బార్లూ -బీర్లూ, పార్కులూ- ఫాస్టఫుడ్లు, జిమ్ములు, స్విమ్ములు, పబ్బులు, క్లబ్బులు.... ఎన్నింటిని ఆశ్రయించినా తప్పకుండా వేడుకోవాల్సిన మరో దైవం - వైద్యో.... నారాయణో....! తర్వాత సంపాదనకీ ఖర్చుకీ మధ్య సమన్వయం కుదరక మెదడు పాదరసమై, ఉన్న చోటు నుండటం మానేసి...

"టిఫిన్ చేసి వెళ్తారా? వచ్చాక చేస్తారా?"

నా ఆలోచల్ని అడ్డుకుంది సైంధవి.... అదే భార్యామణి చందన.

ఠక్కున సమాధానం చెప్పలేకపోయాను.కానీ ఏదో ఒకటి చెప్పకపోతే టైం ఠపీమని నెత్తిన మొట్టికాయ వేస్తుంది. అందుకే నాకు తెలియకుండానే ఔనన్నాను, తిన్నాను. బస్టాండ్‌లో కేవలం నలభై నిమిషాలు నిల్చున్నాను. అంతసేపూ రాని నేనెదురుచూస్తున్న నెంబరు బస్సులు ఒకదాని వెంటి ఒకటి నాలుగు క్యూ కట్టాయి. మొదటి బస్సులో కాలు పెట్టే సందులేదు. మూడో బస్సులో కావల్సినంత ఖాళీ. విండో సీట్లో సెటిలయ్యాను. నా ఆలోచనలు సంతోష్‌కుమార్ వైపు మళ్లాయి.

చికున్‌గున్యాతో బాధపడుతున్న సహోపాధ్యాయుడతడు. వారం రోజులుగా బడికి రావడం లేదు. ఇప్పటికైనా వెళ్లి పలకరించకపోతే బాగుండదు కదా! అందుకని బయలుదేరాను.

సంతోష్ మంచివాడే. మనిషి కూడా అందంగా, ఆకర్షణీయంగా, బలంగా కనిపిస్తాడు.

సంతోష్ నా కంటే చాలా సీనియర్. తొలి పరిచయంలోనే అతని నుండి నేను చాలా నేర్చుకోవచ్చునన్న అభిప్రాయం కలిగింది. నేనీ కొత్త స్కూల్లో అడుగుపెట్టగానే అడక్కుండానే ఇక్కడి వాతావరణం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ వివరాలన్నీ చెప్పేశాడు. అంతేనా? ఎవరెవరి వికృత రూపాలేవో బలహీనతలేవో చెప్పేశాడు. దాంతోపాటు తన గొప్పతనం గురించి కూడా ఎన్నెన్ని ... ఎన్నెన్నని.... ?

"అరె! హెడ్మాస్టరా? వాడు పైకి అట్లా కనిపిస్తాడా? పెద్ద లోఫర్. వానికి లేని బలహీనత లేదనుకో" అన్నాడో సందర్భంలో.

అయోమయంగా చూశాన్నేను. తరగతి గది తప్ప తక్కువగా మాట్లాడడం నా బలహీనత. అదే అతనికి బలం ఇచ్చేది. హెడ్మాస్టరు గురించి అడ్డదిడ్డంగా వాగుతుంటే "పై అధికారుల దృష్టికిగానీ, టీవీ వారికి గానీ సమాచారం ఇవ్వలేకపోయారా?" అన్నాను. 'నీ వన్నీ నిరాధారమైన వ్యాఖ్యలే' నన్న అర్థంలో.

"అబ్బే ఎవరో ఎందుకు? నేనే స్వయంగా ఎనిమిది పేజీల లేఖరాసి డి.ఇ.ఓ.కి సమర్పించాను" అనేశాడు ఠక్కున సంతోష్.

ఉలిక్కిపడ్డాన్నేను. అందమైన సంతోష్ సగం వికారంగా కనిపించసాగాడు. ఉండబట్టలేక అడిగాను "ఏమైంది మరి?"

"ఆ! ఏమౌతదీ? దొందూ దొందే!" అన్నాడు వ్యంగ్యాంగా.

నేన్నోరు తెరిచాను శక్తికొద్దీ.

"వీడు ఏక్ నంబరీ అయితే వాడు దస్ నంబరీ!" అనేశాడు నిర్లజ్జగా.

నేను చుట్టూ చూశాను ఎవరైనా వింటున్నారేమోనని, అదృష్టం బాగుండది. మా చుట్టూ గోడలు కూడా లేవు. అప్పుడు మేం మైదానంలో ఉన్నాం.

ఓ రోజు సాయంత్రం 'సింధు' టీచర్‌తో మాట్లాడుతున్నా.

"ఏయ్! రావయ్యా! అవతల మళ్లీ బస్ దొరకదు" అంటూ బలవంతంగా నన్ను లాక్కుపోయాడు. ఆవిడేమీ అనలేదు, అనుకుందేమో తెలీదు. కానీ సాటి ఉపాధ్యాయినిని ఒక రకంగా అవమానపరచడమే కదా తర్వాత అదే మాటన్నాను సంతోష్‌తో.

"దానికోసం ఎందుకయ్యా అంత ఫీలవుతావు? అదుత్త న్యూస్ పేపర్ టైపయ్యాబాబూ!" తేలిగ్గా నవ్వేశాడు సంతోష్.

ఆ పోలిక నాకర్థం కాలేదు. అది కనిపెట్టేసినట్టున్నాడు మహానుభావుడు.

"అర్థం కాలేదు కదూ! న్యూస్ పేపరంటే ఇలా చదివి, అలా పారేసేదన్నమాట" వంకరగా చూస్తూ కిసుక్కున నవ్వేశాడు.

అతని మీదున్న గౌరవస్థానాన్ని అసహ్యం ఆవరించుకో సాగింది.

తర్వాత రెండ్రోజులు అతనితో మాట్లాడాలనిపించలేదు. కానీ అది మరింత ప్రమాద కరమని అర్థమయ్యింది. నా గురించి ఇతరుల వద్ద అవాకులూ చెవాకులూ మొదలెట్టాడు.

'నోరు మంచిదైతే ఊరంతా మంచి'దని తెలుసు. కానీ నోరు చెడ్డదైతే ఊరంతా భయపడుతుందనీ సంతోష్ వల్లనే తెలిసింది.

నా ముభావాన్ని ఇతరులతో 'సంబంధాల'దాకా తోసుకెళ్తూంటే ఇంతకంటే వీడితో మంచిగా ఉన్నట్టు నటించడమే మేలనిపించింది. అయినా 'నాగరీకు'డ్నై పోయిన నాకు నటించడం లెఖ్ఖా?

సంతోష్ మీద అసహ్యం మరింత పెరగటానికి మరో కారణం ఉంది. అదే ఆచార్యుల వారి గురించి అవాకులు పేలడం. మా స్టాఫ్‌లో నరసింహాచార్యుల తీరే వేరు. 'రామో విగ్రహవాన్ ధర్మః' అన్నట్టు ఆయన రూపమే - చేతులెత్తి నమస్కరించాలన్నంత హుందాగా, అందంగా ఉంటుంది. ఆయన పాఠం చెబుతుంటే ఉపాధ్యాయులకే వినాలనిపిస్తుంది. అంత పెద్దాయన గురించి సంతోష్ వ్యతిరేకంగా మాట్లాడటం నేనిప్పటికీ జీర్ణించుకోలేక పోతున్నా.

బస్సు ఉప్పర్‌పల్లి క్రాస్ రోడ్స్‌కి చేరింది. ఆలోచనల్ని తెగ్గోసుకొని, కిందకి దిగాను. గబగబా నడుచుకుంటూ సంతోష్ వాళ్లింటికెళ్ళాను. ద్వారం బయట పరచయమున్న చెప్పుల జత కనిపించింది.

లోపల్నుండి వినిపిస్తున్న మాటలు నన్ను గుమ్మం బయటే ఆపేశాయి.

"సార్! నిజంగా మీలో సాక్షాత్తూ దైవాన్ని చూస్తున్నాను. వారం రోజులైంది. ఇంత వరకూ మనవాళ్లెవ్వరూ పలకరించిన పాపాన పోలేదు. ఎప్పుడూ నా వెంట తిరిగే ఆ బేవార్స్ శివగాడు కూడా కనీసం ఫోనైనా చేయలేదు"

ఇంకా ఏమేం వాగేవాడో? నేను ప్రత్యక్షమయ్యాను.

సంతోష్ కళ్లలో కంగారు.

"రా రా! శివా! నీ గురించే చెబుతున్నాడు సంతోష్" సాదరంగా ఆహ్వానించారు నరసింహాచార్యులు.

'అశ్వత్థామ హతః....' అన్న ధర్మరాజు కనిపించారు నాకు ఆచార్యుల్లో.

నేను కూడా సంతోష్ ఏమన్నాడో విననట్టే నటించి ఒక తీయని పలకరింపు, రాలేని నా నిస్సహాయ స్థితికి మొహంలో విచారం ప్రదర్శించి, ఆచార్యులతో పాటే బయటపడ్డాను. ఆచార్యులు స్కూటర్ తేవడం, వాళ్లింటికి వెళ్తానని నేను ప్రతిపాదించడం నాకు కలిసొచ్చిన రెండు అంశాలు.

లక్ష్మీనగర్‌లోనే ఆచార్యులవారుండేది. ఇద్దరమూ బయల్దేరాము.

"సార్! మీకు స్టేట్ లెవెల్ బెస్ట్ టీచర్ అవార్డు వచ్చిందా" అడిగాను. నా ఉద్దేశ్యం ఆయనకు జాతీయ స్థాయి అవార్డే వచ్చి ఉండాలి. కానీ ఇంత వరకు వచ్చిందో లేదో తెలీదు.

"బలే వాడివే!" తేలిగ్గా తీసేస్తూ నవ్వుతూ అన్నారాయన. "మండల స్థాయి అవార్డే గత సంవత్సరం దక్కింది."

ఆయన దాతృత్వం, అంకితభావం చూశాను. సేవా నిరతి గురించి విని ఉన్నాను. బోధనలో ఆయనకు సాటిరాగల వారు అరుదు. ఇటువంటి వాళ్లకి అవార్డులు రావు. ఆ సంతోష్‌కి రెండేళ్ల కిందటే జిల్లా అవార్డు వచ్చిందట. ఈసారి 'స్టేట్ కూడా వస్తుందంటున్నారు. అదే అన్నాను.

"అదేంటి సార్! సంతోష్ లాంటి అవతవక మనుషులకు స్టేట్‌అవార్డు వస్తున్నప్పుడు, మీలాంటి వాళ్లకు...."

"తప్పు శివా! ఎదుటివాళ్ల తప్పులు వెతకడం గొప్పకాదు. అలా చేస్తున్నామంటే మనలోనూ లోపం ఉందన్నట్టే! ప్రతి వారిలోనూ మంచిని చూడ్డం అలవాటు చేసుకోవాలయ్యా చంద్రునిలో కూడా మచ్చ ఉంటుంది. కాని దానివల్ల సమాజానికి నష్టం కల్గటం లేదు కదా! మరి మానవ మాత్రుల్లో ఏదో ఒక బలహీనత ఉంటుంది."

"కానీ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వాళ్లలో అలాంటి లోపాలుంటే దాని ప్రభావం సమాజం మీద పడుతుంది కద సార్"

"అందుకేనయ్యా చెప్పేది – మనం చేసేది ఉద్యోగం కాదు వృత్తి అని. దురదృష్ట వశాత్తూ మనమూ ఉద్యోగస్తులమయ్యాం. గురువు నుండి ఆచార్యుడికి, ఆచార్యుడి నుండి ఉద్యోగస్తుని స్థాయికొచ్చేశాం. స్థానంతో పాటే శాసించే స్థితి నుండి కేవలం శాసనాలను పాలించే స్థితికి దిగజారాం. ఇంకా విలువలు మిగులున్నాయంటే ఉపాధ్యాయుల్లో ఆచార్యత్వం అంటే ఆచరించి చూపగలిగే రోల్ మోడల్స్ కొందరిలోనైనా ఉండటమే. దాన్నే మనమూ ఆదర్శముగా తీసుకోవాలి. వాళ్లకంటే మంచి పేరు తెచ్చుకునేందుకు కృషి చేయగలగాలి. అంతేగానీ చుట్టూ ఉన్న చీకటిని ఎంత కాలం తిట్టినా ఏమిటి ప్రయోజనం?"

మాటల్లోనే వాళ్ల ఇల్లు చేరుకున్నాం.

పాతకాలం ఇల్లది. గేట్ లోపల సుమారు ఇరవై గజాల ఖాళీ స్థలమున్నది. కుడిపక్క మూలన ఓ మామిడి చెట్టు, చెట్టునానుకుని ఓ కుళాయి, ఆ పక్కనే సంప్ ఉన్నాయి.

హాలు పెద్దగానే ఉంది. ఓ సోఫా, రెండు కుర్చీలు, ఓ టీపాయి, టీవీ స్టాండు, పక్కనే గోడకున్న అరల్లో కొన్ని బహుమతులూ – జ్ఞాపికలూ మిగతా రెండు గోడలకూ చాలా భాగం షెల్ఫ్‌లు, వాటి నిండా పుస్తకాలే.

హాల్లో వేర్వేరు ఈడు గల పిల్లలు చదువుకుంటున్నారు. వాళ్లంతా బడికెళ్లే వాళ్లలా కనిపించడంలేదు. పేద పిల్లలని తెలుస్తోంది. ఆచార్యుల వారి శ్రీమతి, పిల్లలూ వాళ్ల సందేహాలు తీరుస్తున్నారు. ఇంట్లోకెళ్లగానే వాళ్లని పరిచయం చేశారు ఆచార్యులు.

"నా శ్రీమతి లక్ష్మీ, అష్టలక్ష్మీ సంగమం. ఇంట్లో ఊరికే ఉండలేక ఇలా వీధి పిల్లల్ని చేరదీసి పాఠాలు చెబుతుంది. ఎం.వి.ఎఫ్ టైపన్న మాట"

"ఊరుకోండి, ఆ మాస్టారు నిజమే అనుకోగలరు. ఇదంతా ఆయన పనేనండీ. ఆపద్ధర్మంగా ఆయన అందుబాట్లో లేనప్పుడు నేను పెత్తనం చలాయిస్తూంటానంతే. పంతులమ్మ (ఆమె ఉద్దేశ్యం పంతులుగారి భార్య) అన్నాక ఆ మాత్రం ఉండాలి కదండీ!" అన్నదా తల్లి నవ్వుతూ.

"మా అబ్బాయి కిరణ్. అమ్మాయి మాధురి. వాడు ఇంటర్, ఇది నైన్త్,"

పిల్లలిద్దరూ నమస్కరించారు.

నేను "హలో! అంటూ కరచాలనం చేయబోయి తడబడి, తమాయించుకొని, ఆపై ప్రతి నమస్కారం చేశాను.

అక్కడ పది నిముషాలు కూర్చోవడం ఎంతో ప్రశాంతత నిచ్చింది. ఆచార్యుల ధర్మపత్ని ఇచ్చిన చిక్కటి కాఫీ మరింత హాయినిచ్చింది. ఇక బయల్దేరదామనుకుంటూండగా లోపలి గదిలో కిరణ్, మాధురీ కీచులాట చెవినబడింది.

"హు! ఎంతటి ప్రశాంతి నిలయమైనా 'తోబుట్టువుల తగాదా' తప్పదన్న మాట అనుకుంటుంటే మా పిల్లలు గుర్తుకొచ్చారు. అంతలోనే మాధురి మా వద్దకొచ్చి, తండ్రికి ఫిర్యాదు చేసింది.

"చూడు నాన్నా! ఈ రోజు తాతయ్యని పార్కుకి తీసుకెళ్లాలిసింది నేను గదా! అన్నయ్య తీసుకెళ్తానంటున్నాడు"

కిరణ్ వచ్చాడు అంతలో.

"దానికి యూనిట్సున్నాయి నాన్నా! చదువుకోమంటే..."

"ఆ! నాకన్నీ వచ్చు!" మొండిగా అంది మాధురి.

"వెళ్లనీ కన్నా! తర్వాత వారం నువ్వెళ్ళువుగానీ" కొడుక్కి సర్దిచెప్పారు ఆచార్యులు.

ఆ తర్వాత డైబ్బై పై బడ్డ వృద్ధుడ్ని భుజమ్మీద చేయి వేయించుకొని నడిపించుకెళ్ళసాగింది మాధురి.

"మా మావయ్యగారు. వినపడదు, కనబడదూ. రోజూ ఉదయం లేదా సాయంత్రం ఈయన గానీ, నేను గానీ వాకింగ్‌కి తీసుకెళ్తాం. సెలవు రోజుల్లో పిల్లల వంతు. అందుకే ఈ పోటీ" ఖాళీ కప్పులు తీసుకొని వెళ్తూ నవ్వుతూ చెప్పింది లక్ష్మి.

ఒక్క క్షణం నన్ను నేను నమ్మలేకపోయాను. 'ఇంకా ఇలాంటి కుటుంబాలు ఉన్నాయా?' అనిపించింది. "సార్! మీ పాఠం విన్నాను. మీ అంకిత భావం చూశాను. ఉన్నతమైన మీ సంస్కారం తెలుసుకున్నాను. మీకు జాతీయ అవార్డు రావాలి. మీలాంటి వాళ్లకు రాకపోతే వాటికి అర్థమే లేదు సార్. కనీసం అప్లై చెయ్యండి సార్"

"శివా! ఎందుకో నాకా పద్ధతి నచ్చలేదయ్యా. నాకు ఉత్తమ ఉపాధ్యాయుడనే అవార్డివ్వండీ! అని అడుక్కోవడమేంటి? మన పై అధికారులు, ఆ పై వాళ్లూ ఉత్తములైన ఉపాధ్యాయులను గుర్తించాలి. వాళ్లే స్వయంగా అలాంటి వాళ్లను పిలిపించుకొని, అవసరమైన వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదించాలి. అటువంటి రోజులు వస్తాయనే ఆశిద్దాం. అయినా ఎవరి గుర్తింపు కోసమో పాకులాడటమెందుకు? అందరికంటే ఎక్కువ గుర్తింపు నిచ్చేవాళ్లు విద్యార్థులే. నిష్కల్మషమైన ఆ పసి హృదయాల్లో చోటు సంపాదించడం కంటే గొప్ప అవార్డేముంటుంది?"

అట్లా మాట్లాడుతూన్న నరసింహాచార్యులు మాస్టార్ని చూస్తూ ఉండిపోయాను.

❀❀❀

ఆంధ్రభూమి సచిత్రవార పత్రిక 30-11-2006)